TGTEL/25/A1907

# అమృత్ తెలంగాణ

తెలుగు దిన పత్రిక

సంపుటి: 01 సంచిక : 220 ఎడిటర్ : సింగిడి అమృత్, తెలంగాణ శనివారం.07.03.2026 పేజీలు : 8, వెల:రూ.2.00

PUBLISHED FROM ADILABAD,NIRAML,MANCHIRAL,KOMARAMBHEEM, ASIFABADKARIMNAGAR,JAGITIYALA,PEDAPALLI,JAI SHANKA BHUPALLI, NIZAMABAD,KAMAREDDY,MEDCHEL,HYDERABAD

రిపోర్టర్లు కావలెను

TGTEL/25/A1907 అమృత్ తెలంగాణ తెలుగు దిన పత్రిక

తెలుగులో రాయగల సమర్థత, సమాజం పట్ల అవగాహన ఉంటే చాలు.

తెలుగు రాష్ట్రాలలో సంచలనాలు సృష్టిస్తున్న

TGTEL/25/A1907 అమృత్ తెలంగాణ తెలుగు దిన పత్రిక

మీకు సరైన వేదిక... అన్ని జిల్లాల, మండలాల మరియు నియోజకవర్గాల పరిధిలో పనిచేసేందుకు అవకాశం కల్పిస్తోంది.

ఇంకెందుకు ఆలస్యం

9849973404, 6304156955

వాట్సాప్‌లో మీ బయోడేటాను పంపండి.

## అసైన్డ్ భూముల సమస్యకు శాశ్వత పరిష్కారం

హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: రాష్ట్రంలో అసైన్డ్ భూములకు సంబంధించిన సమస్యలకు శాశ్వత పరిష్కారం కల్పిస్తామని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. అదే విధంగా లిడ్‌క్యాప్ భూములు అన్యాక్రాంతం కాకుండా తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. లోయర్ ట్యాంక్‌బండ్‌లో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ భవన్, కాచిగూడ నింబోలిఅడ్డలో బాబూ జగ్జీవన్‌రాం ఆత్మగౌరవ భవనాలను నిర్మిస్తామనీ, దానికి సంబంధించిన ప్రక్రియను వెంటనే చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించారు. ఈ విషయంలో సీఎస్‌తో సమీక్షించాలని మంత్రులు దామోదర రాజనర్సింహ, అడ్లూరి లక్ష్మణ్‌లకు సూచించారు. ఏప్రిల్ 14 అంబేద్కర్ జయంతిలోపే వాటికి అవసరమైన నిధులు విడుదల చేస్తామని చెప్పారు. మహాభారతంలో మిత్రుడు బార్బరీకుని కోసం సర్వం ఒడ్డి, ఊపిరిపోయే వరకు నిలబడి మిత్రధర్మం నిర్వహించిన కర్ణునిలా మాదిగలకు అండగా ఉంటానని మాటిచ్చారు.

కర్ణుని లక్షణం బలహీనుల పక్షాన నిలబడి పోరాడే లక్షణమనీ, అందుకే బలహీనులైన మాదిగల పక్షాన రాజకీయంగా నిలబడ్డానని సీఎం తెలిపారు. తెలంగాణ మాదిగ ఉద్యోగుల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని శిల్పకళావేదికలో శుక్రవారం నిర్వహించిన ధన్యవాద సభలో సీఎం ఏ.రేవంత్ రెడ్డి పాల్గొని మాట్లాడారు.ఎస్సీ వర్గీకరణ కోసం జరిగిన ఉద్యమంలో మొదట్నుంచి తన వంతు సాయం చేశానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. వర్గీకరణ కోసం గతంలో అసెంబ్లీలో వాయిదా తీర్మానం ఇస్తే నాటి ప్రభుత్వం తనను బయటికి పంపించిందని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజాపాలన రావడంలో మాదిగలు అండగా నిలబడ్డారని అన్నారు. తాము అధికారంలోకి వచ్చాక కొన్ని సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించినట్టు చెప్పారు. ముఖ్యంగా సుప్రీంకోర్టు అనుకూలంగా తీర్పునివ్వడంతో వెనువెంటనే వర్గీకరణ కోసం అవసరమైన చర్యలను తీసుకున్నట్టు సీఎం తెలిపారు.

అదే క్రమంలో పదోన్నతుల్లో వర్గీకరణ, లిడ్‌క్యాప్ భూముల రక్షణ, అసైన్డ్‌ల్యాండ్స్ సమస్యలు అన్నింటినీ పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నామని ఆయన స్పష్టం చేశారు. పరిష్కరించే క్రమంలో వెనుక నుంచి తనపై జరిగే దాడిలో అండగా నిలబడాలని ఆయన కోరారు. మాదిగల హక్కులకు లిఖితపూర్వకంగా చట్టబద్ధత కల్పిస్తామని తెలిపారు. ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నదనీ, అవి చివరి పేదవారి వరకు చేర్చాల్సిన బాధ్యత ప్రభుత్వ ఉద్యోగులుగా మీదేనని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. పంచేందుకు ప్రభుత్వం వద్ద భూముల్లేవనీ, నజరానాలు ఇచ్చేందుకు నిధులు లేవనీ, నాణ్యమైన విద్యనందించేందుకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళ్తున్నామని చెప్పారు. నాణ్యమైన విద్యతో ఐఏఎస్,




ఏపీఎస్, ప్రజా ప్రతినిధులుగా ఎదిగి తెలంగాణ పునర్నిర్మాణంలో భాగస్వాములు కావాలని సూచించారు.

పదోన్నతుల్లో వర్గీకరణను పరిశీలిస్తాం : మంత్రి దామోదర రాజనర్సింహ

పదోన్నతుల్లో వర్గీకరణ అమలు డిమాండ్‌ను పరిశీలిస్తామని రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి నిబద్ధత కలిగిన నాయకుడనీ, ఎస్సీ వర్గీకరణ అమలు కోసం అన్ని ఒత్తిడులను తట్టుకుని ముందుకెళ్లారని తెలిపారు. ప్రజలకు నాణ్యమైన విద్య, వైద్యం, సామాజిక భద్రతను అందించడమే తమ ప్రభుత్వ ప్రాధాన్యతలని తెలిపారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ అంబేద్కర్ అందించిన రిజర్వేషన్ ప్రయోజనాలు అందరికీ అందించాలనే లక్ష్యంతో చేసిన వర్గీకరణ ఫలాలు అందుతున్నాయని అన్నారు. విద్య ప్రవేశాల్లోనూ, ఉద్యోగ నియామకాల్లోనూ గతంలో ఎప్పుడు రాని ఎస్సీ ఉప కులాలు వస్తున్నాయని హర్షం వ్యక్తం చేశారు. లోయర్ ట్యాంక్‌బండ్‌లో అంబేద్కర్ భవన్, కాచిగూడ నింబోలిఅడ్డలో బాబూ జగ్జీవన్‌రాం భవన్‌లను నూతన భవనాలను నిర్మించేందుకు అనుమతించాలని ముఖ్యమంత్రిని కోరారు.

## తెలంగాణ సొమ్ముతో కేరళలో ప్రచారం



హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: రాష్ట్రంలో ఖజానా ఖాళీ అయిందని కల్లబొల్లి మాటలు చెప్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పక్క రాష్ట్రమైన కేరళలో మాత్రం రూ.వందల కోట్ల తెలంగాణ ప్రజాధనాన్ని మంచి నీళ్లలా పారబోస్తున్నారని బీఆర్ఎస్ఎల్పీ ఉప నేత, మాజీమంత్రి తన్నీరు హరీశ్‌రావు విమర్శించారు. తెలంగాణ సొమ్ముతో కేరళలో కాంగ్రెస్ ఎన్నికల ప్రచార ఆర్భాటాన్ని చేస్తున్నదని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేరళ ఎన్నికల కోసం అక్కడి మలయాళ పత్రికల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఫొటోలతో ఇస్తున్న ఫుల్ పేజీ యాడ్స్ చూస్తుంటే కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ ఖజానా ఒక ఏటీఎంలా మారిందని అర్థమవుతోందని తెలిపారు.

ఆరు గ్యారంటీలు, 420 హామీలు అంటూ నమ్మించి తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఇక్కడ ప్రజల గొంతు కోసి, కేరళలో కలర్ పేజీల్లో యాడ్స్ ఇస్తోందని విమర్శించారు. ఇక్కడ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసే తెలివి లేదు గానీ, ప్రకటనల పేరిట తెలంగాణ ప్రజల ధనం కేరళలో వృధా చేస్తారా?అని ప్రశ్నించారు. ఆడబిడ్డల కంట్లో మట్టికొట్టి కేరళ పత్రికల్లో మాత్రం కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేశామంటూ దొంగ ప్రచారం చేసుకుంటున్నదని విమర్శించారు. నిరుద్యోగుల కోసం జాబ్ క్యాలెండర్‌ను అమలు చేయకపోగా విద్యార్థులపై పోలీసులు లాఠీలతో విరుచుకుపడుతున్నారని తెలిపారు. బడుల్లో చదువుకునే పిల్లలకు కనీస వసతులు లేవని పేర్కొన్నారు. ఏకకాలంలో రూ.రెండు లక్షల రుణమాఫీ అని చెప్పి కొర్రీలు పెట్టి సగానికి పైగా రైతులను నట్టేట ముంచారని విమర్శించారు. ఎకరాకు రూ.15 వేల రైతుభరోసాను రెండు సీజన్లకు ఎగ్గొట్టిందని తెలిపారు.

కనీసం యూరియా సరఫరా చేసే పరిస్థితి లేదని పేర్కొన్నారు. ఆసరా పెన్షన్ రూ.నాలుగు వేలకు పెంపును గాలికొదిలేశారని తెలిపారు. రిటైర్డ్ ఉద్యోగులకు బెనిఫిట్స్‌ను చెల్లించడం చాతగాని కాంగ్రెస్ ప్రభుత్వం కేరళలో మాత్రం అద్భుత పాలన అంటూ ప్రచారం చేసుకుంటున్నదని విమర్శించారు. అధిష్టానాన్ని మెప్పించడానికి తెలంగాణ ఖజానాను కాంగ్రెస్ అక్షయ పాత్రగా మార్చారని తెలిపారు. తెలంగాణ ప్రజల కన్నీళ్లు తుడువలేని సీఎం రేవంత్‌రెడ్డి కేరళలో ప్రచారం కోసం రూ.వందల కోట్లు ఖర్చు చేయడం శోచనీయమని పేర్కొన్నారు. అబద్ధపు హామీలతో తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ మాయలో కేరళ ప్రజలు పడొద్దని విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే ఇతర రాష్ట్రాల్లో దొంగ ప్రచారాలను తక్షణమే ఆపాలని డిమాండ్ చేశారు.

## బడ్జెట్ కొలిక్కివచ్చేదెప్పుడు?


హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: రాష్ట్రంలో వచ్చే ఆర్థిక సంవత్సరం (2026–27) ఏప్రిల్ నుంచి ప్రారంభం కానుంది. రాష్ట్ర బడ్జెట్‌పై కసరత్తు మాత్రం నత్తనడకన సాగుతున్నట్టు తెలుస్తున్నది. ప్రస్తుతం అంతా అధికారుల కేంద్రంగానే ఈ ప్రక్రియ కొనసాగుతున్నది. ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క కుమారుడు సూర్య విక్రమాదిత్య వివాహం ఈనెల ఐదున హైదరాబాద్‌లో నిర్వహించారు. ఆ వివాహ పనుల్లో ఆయన నిమగ్నం కావడంతో బడ్జెట్ కసరత్తు పనులకు సంబంధించి అధికారులపైనే భారం పడింది. ఇంకోవైపు అన్ని శాఖల మంత్రులు, సంబంధిత అధికారులతో సన్నాహక సమావేశాలను నిర్వహించడానికి ఆర్థిక శాఖ షెడ్యూల్‌ను జారీ చేసింది. రెండు సార్లు ఆ సమావేశాలు వాయిదా పడడం గమనార్హం. ఆన్‌లైన్‌లో ప్రతిపాదనలకే ఆర్థిక శాఖ పరిమితమైంది. వాటి ఆధారంగానే ఆర్థిక శాఖ అధికారులు బడ్జెట్‌పై కసరత్తు చేస్తున్నారు.

అయితే శాఖలు ఆన్‌లైన్‌లో సమర్పించే ప్రతిపాదనల్లో బడ్జెట్ కేటాయింపులు ఎక్కువ ఉండాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తాయి. ప్రభుత్వ ఆర్థిక పరిస్థితి, కేంద్రం నుంచి వచ్చే గ్రాంట్లు, అప్పు ఇలా అన్ని అంశాలనూ పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపులను చేస్తుంది. ప్రభుత్వ ప్రాధాన్యతలు, ఆరు గ్యారంటీలు, ఇచ్చిన హామీలు, ప్రజల అవసరాలు ఇలా ఇతర అంశాలనూ పరిశీలించి నిర్ణయం తీసుకుంటుంది. అందులోనూ ప్రభుత్వ ప్రాధాన్యతలకు పెద్దపీట వేస్తుంది. అయితే మంత్రులు, సంబంధిత శాఖల అధికారులతో నేరుగా సంప్రదిస్తేనే ప్రతిపాదనలు, కేటాయింపులపై స్పష్టత వస్తుంది. ఈ సంప్రదింపులను చేయకపోవడం వల్ల ప్రభుత్వ తీరుపై కొంత అసహనం వ్యక్తమవుతున్నది. ఈనెల 16 నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కాబోతున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర బడ్జెట్ ఎప్పుడు కొలిక్కి వస్తుందన్న చర్చ సర్వత్రా జరుగుతున్నది.

ఇక బడ్జెట్ కసరత్తులో భట్టి బిజీ బిజీ

కుమారుని పెండ్లి ముగియడంతో ఇక బడ్జెట్ కసరత్తులోనే ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖమంత్రి భట్టి విక్రమార్క నిమగ్నమవుతారని అధికారులు చెప్తున్నారు. పూర్తిగా బిజీబిజీగా ఉంటారని సమాచారం. అన్ని శాఖల మంత్రులు, అధికారులతో సంప్రదింపులు చేస్తారని తెలుస్తున్నది. విశ్వసనీయ సమాచారం ప్రకారం ఈనెల తొమ్మిది నుంచి సన్నాహక సమావేశాలను ప్రారంభించే అవకాశమున్నది. ఆరు గ్యారంటీలు, 420 హామీలను కాంగ్రెస్ ఎన్నికల్లో హామీ ఇచ్చింది. వివిధ డిక్లరేషన్లను కూడా విడుదల చేసింది. అయితే ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, ఇందిరమ్మ ఇండ్ల మంజూరు, రేషన్‌కార్డుల పంపిణీ, రూ.500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.పది లక్షల వరకు పెంపు వంటి హామీలను అమలు చేయడం వల్ల ప్రజల్లో సానుకూలత వ్యక్తమవుతున్నది. పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లోనూ ప్రజలు అధికార కాంగ్రెస్‌కే జై కొట్టారు.

అయితే ఆరు గ్యారంటీలు, 420 హామీల్లో మెజార్టీ వాగ్దానాలు ఇంకా అమలుకు నోచుకోలేదని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక



సాయం, రైతుభరోసా కింద ఎకరాకు రూ.15 వేలు చెల్లింపు, విద్యార్థులకు రూ.ఐదు లక్షల వరకు విద్యా భరోసా కార్డు, ఆసరా పెన్షన్లు రూ.నాలుగు వేలకు పెంపు, నిరుద్యోగ భృతి, రెండు లక్షల ఉద్యోగాల భర్తీ, ఉద్యోగులకు పెండింగ్ డీఏల మంజూరు, 51 శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్సీ అమలు, కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సీపీఎస్) రద్దు చేసి పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) పునరుద్ధరించడం, ఉద్యోగుల పెండింగ్ బిల్లుల చెల్లింపు వంటి వాటితోపాటు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయాలన్న డిమాండ్ వస్తున్నది. రానున్న బడ్జెట్‌లో వాటి అమలు కోసం నిధులను కేటాయించాలని ప్రజలు కోరుతున్నారు. అయితే ప్రభుత్వం ఏయే అంశాలకు ప్రాధాన్యత ఇస్తుందో ఆసక్తి నెలకొంది. కొత్త పథకాలను ప్రారంభిస్తుందా?అనేది కూడా చర్చనీయాంశంగా మారింది.

ప్రజా పాలన– ప్రగతి ప్రణాళికకు ఇబ్బందులు

ప్రజా పాలన– ప్రగతి ప్రణాళిక పేరిట ఈనెల ఆరు నుంచి జూన్ 12 వరకు కాంగ్రెస్ ప్రభుత్వం 99 రోజులపాటు ఈ ప్రణాళికను అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. శుక్రవారం లాంఛనంగా ఈ కార్యక్రమం ప్రారంభమైంది. అయితే ఆచరణలో ఈ కార్యక్రమం అమలుకు కొన్ని ఇబ్బందులు వస్తున్నాయి. రాష్ట్ర బడ్జెట్ సమావేశాలు ఈనెల 16 నుంచి ప్రారంభం కాబోతున్నాయి. అసెంబ్లీ జరిగే సమయంలో సీఎస్ సహా అన్ని శాఖల ఉన్నతాధికారులు అసెంబ్లీకే పరిమితమవుతారు. ఇంకోవైపు బడ్జెట్ కసరత్తుకు సంబంధించిన సన్నాహక సమావేశాల్లోనూ కీలకంగా వ్యవహరిస్తారు. ఈ నేపథ్యంలో అసెంబ్లీ జరిగినన్ని రోజులు ప్రజా ప్రాలన–ప్రగతి ప్రణాళిక కార్యక్రమం సజావుగా సాగుతుందా?అన్న ప్రశ్న తలెత్తుతున్నది. అసెంబ్లీ సమావేశాలు ముగిసిన తర్వాతే ఇది పూర్తిస్థాయిలో అమలయ్యే అవకాశమున్నది. ఇప్పటికే ఎండలు విపరీతంగా ఉన్నాయి. ఎండాకాలంలో 99 రోజుల కార్యక్రమం చేపట్టడం వల్ల ప్రజల భాగస్వామ్యం ఏ స్థాయిలో ఉంటుందోననే చర్చ కూడా జరుగుతున్నది.

## మూసీ ప్రక్షాళన చేసి తీరుతాం

శంషాబాద్ : అమృత్ తెలంగాణ:మూసీ ప్రక్షాళన చేసి తీరుతామని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తుంటే.. కొందరు గుంపులుగా అడ్డుకుంటున్నారని అన్నారు. రంగారెడ్డి జిల్లాను ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. శుక్రవారం రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండల పరిధిలోని హిమాయత్‌సాగర్ వద్ద 85 ఎకరాల విస్తీర్ణంలో రూ.75 కోట్లతో నిర్మించిన ఏకో పార్కు టూరిజం కేంద్రాన్ని ప్రారంభించారు. అలాగే బుద్వేల్ నుంచి నాచారం వరకు రూ.488 కోట్లతో 250 ఫీట్ల వెడల్పుతో నిర్మించనున్న నేషనల్ హైవే 167 రేడియల్ రోడ్డు–2 పనులనూ ప్రారంభించారు. అనంతరం రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సీఎం మాట్లాడారు. హైదరాబాద్ నగరానికి చారిత్రక నేపథ్యం ఉందని గుర్తు చేశారు. చార్మినార్, గోల్కొండ, మక్కా మసీద్, ఉస్మానియా ఆస్పత్రి, ఉస్మానియా కాలేజ్‌తోపాటు అనేక అద్భుత నిర్మాణాలు ఉన్నాయన్నారు. హిమాయత్ సాగర్ వద్ద నిర్మించిన ఏకో పార్కు అద్భుతమైనదని తెలిపారు. వినోదం, ఆహ్లాదం కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లి రావాల్సిన అవసరం లేకుండా.. ఇక్కడే వివిధ ప్రాంతాల ప్రజలు వచ్చి ఈ ప్రాంతాన్ని సందర్శించే విధంగా అద్భుతంగా తీర్చిదిద్దామని అన్నారు. పర్యాటక కేంద్రంగా హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో నిర్మించి సామాన్యులకు, అన్ని వర్గాలకూ అందుబాటులో ఉండే విధంగా అన్ని రకాల పర్యావరణహితమైన సౌకర్యాలతో ఏర్పాటు చేశామని తెలిపారు. పెద్ద నిర్మాణమైనా దాని నిర్వహణ సరిగ్గా లేకపోతే.. త్వరలోనే పాడవుతుందని అన్నారు. నాటి నైజాం వరదల నివారణ కోసం నిర్మించిన గొప్ప చారిత్రాత్మకమైన మూసీ.. నేడు మురికి కుంపగా మారిందని తెలిపారు. గత పాలకులు దాన్ని పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. మూసీ రివర్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆధ్వర్యంలో మూసీ నదిని సుందరంగా తీర్చిదిద్దడానికి ప్రణాళిక రూపొందించి, అభివృద్ధి చేయడానికి ప్రయత్నిస్తుంటే.. బీఆర్ఎస్ నాయకులు గుంపులు గుంపులుగా అడ్డుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.



# ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలి: రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు.



నిర్మల్ జిల్లా మార్చ్ 6 అమృత్ తెలంగాణ ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి (జిల్లా ఇన్ చార్జి మంత్రి) జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం మంత్రి జూపల్లి, ఆదిలాబాద్ కలెక్టరేట్ నుంచి, ఎంపీ గోడం నగేష్, పలువురు ఎమ్మెల్యేలతో కలిసి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమం నిర్వహణపై సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అమలు పరుస్తున్న పలు అభివృద్ధి, సంక్షేమ పథకాల ఫలాలు ప్రజలందరికీ క్షేత్రస్థాయిలో మెరుగ్గా అందాలన్న ఉద్దేశ్యంతో "ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక" కార్యక్రమాన్ని చేపట్టిందని అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా 99 రోజులపాటు, అన్ని శాఖలకు నిర్దేశించిన లక్ష్యాలు పకడ్బందీగా పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో ప్రత్యేక పరిశుధ్య పనులు చేపట్టాలని వివరించారు. పెండింగ్ లో ఉన్న ఫైల్స్ లను పరిష్కరించాలని పేర్కొన్నారు. వేసవిలో ప్రజలకు త్రాగునీటి ఇబ్బందులు కలుగకుండా తగు ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాల గురించి ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో అన్ని వర్గాల ప్రజలు, ప్రజా ప్రతినిధులను భాగస్వామ్యం చేయాలని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి, జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులతో మాట్లాడుతూ, జిల్లాల్లో ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వివిధ శాఖలకు కేటాయించిన పనులన్నీ ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలని అన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు, పెండింగ్ ఫైల్స్ పరిష్కారం, వైద్యారోగ్య కార్యక్రమాలు, మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాలపై అవగాహన, అరైవ్ అలైవ్ కార్యక్రమం, తదితర కార్యక్రమాలన్నీ ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని అన్నారు. అధికారులు, ప్రజలు, ప్రజాప్రతినిధుల సంయుక్త భాగస్వామ్యంతో 99 రోజుల ప్రత్యేక కార్యక్రమం విజయవంతంగా పూర్తి చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల నిర్వహణను స్వయంగా పర్యవేక్షిస్తామని స్పష్టం చేశారు. సంబంధిత శాఖల అధికారులు అందరూ తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో ఈ కార్యక్రమాలలో పాల్గొనాలని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ లు వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, ముధోల్ శాసనసభ్యులు పవార్ రామారావు పటేల్, నిర్మల్ మున్సిపల్ చైర్మన్ అప్పాల కావ్య, వైస్ ఛైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి, భైంసా మున్సిపల్ చైర్మన్ దత్తాత్రి, నిర్మల్, భైంసా ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ లు సోమ భీమ్ రెడ్డి, షిండే ఆనంద్ రావు పటేల్, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# డ్వాక్రా నూతన భవనా నిర్మాణానికి భూమి పూజ



బామ్నీ బి లో నూతనంగా నిర్మించబోయే వివో బిల్డింగు కు భూమి పూజ చేసిన సర్పంచ్ ఉపసర్పంచ్

నిర్మల్ జిల్లా నర్సాపూర్ జి మార్చ్ 6 అమృత్ తెలంగాణ నర్సాపూర్ జి మండలంలోని బామ్నీ బీ గ్రామంలో శుక్రవారం సర్పంచ్ సరస్వతిబాయి, ఉప సర్పంచ్ రవి, చేతుల మీదుగా 10 లక్షలతో SHG (వివో)నూతన భవన నిర్మాణానికి భూమి పూజ చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో కూన రవికుమార్, వార్డు మెంబర్లు వివో అధ్యక్షులు, స్వరూప, సునీత, సీసీ ముత్యం, సీఏ మీనా, పంచాయతీ కార్యదర్శి గంగాజల, డ్వాక్రా మహిళలు గ్రామ పెద్దలు పాల్గొన్నారు

# కంచరోని చెరువు భూముల ఆక్రమణలు తొలగించిన అధికారులు.





చెరువులో అక్రమ నిర్మాణాలను తొలగిస్తున్న అధికారులు

నిర్మల్ జిల్లా మార్చ్ 6 అమృత్ తెలంగాణ నిర్మల్ పట్టణ మండలం కంచరోని చెరువు శిఖం భూముల ఆక్రమణలు అధికారులు తొలగించారు. చెరువు శిఖం భూముల్లో గుర్తు తెలియని వ్యక్తులు ఫ్లాట్ లు ఏర్పాటు చేసి విక్రయించే ప్రయతం చేయగా, సమాచారం అందుకున్న రెవెన్యూ, ఇరిగేషన్

అధికారులు ఆ ప్రదేశానికి వెళ్లి ఆక్రమణలు తొలగించారు. అక్కడ వేసిన మొరం తీసివేశారు.

# డిడివో లు సిసిఎస్ ఉద్యోగుల డెమోగ్రాఫిక్ డీటెయిల్స్ సరి చేయాలి...



నిర్మల్ జిల్లా డిటిఓ సరోజ,

నిర్మల్ జిల్లా మార్చ్ 6 అమృత్ తెలంగాణ నిర్మల్ జిల్లా లోని డీడీవో లందరికి తెలియపరుచునది ఏమనగా తమ పరిధి లో గల సీపీఎస్ ఉద్యోగుల యొక్క డెమోగ్రాఫిక్ డిటైల్స్ లో మొబైల్ నెంబర్,పాన్ కార్డ్ నెంబర్ బ్యాంకు అకౌంట్ ,నామినీ వివరాలు మొదలగునవి సరిగా ఉన్నాయా లేదా సరిచూసుకుని డీడీవో లాగిన్ లోనే ఈ వెసులుబాటు ను కల్పించారని నిర్మల్ జిల్లా డీటీఓ సరోజ, ఒక ప్రకటనలో పేర్కొన్నారు..పై వివరాల కోసం సంబంధిత డీడీఓ జ=ూ చీూఖూ జూతీశేఘుఅ ంఱవ లోకి వెళ్లి యూసర్ ఐడి ఎశీఇ లో డీడీఓ రిజిస్ట్రేషన్ నంబర్ తో రెండు సున్నాలు (0 0) జోడించి పాస్ వర్డ్ రీసెట్ చేసుకోవాల్సిందిగా కోరుతున్నారు.ఇంకా ఏవైనా సమస్యలు ఉంటే సంబంధిత ట్రెజరీ అధికారులను సంప్రదించి పరిష్కరించుకోవాలని కోరుతున్నారు

# ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో అందరినీ భాగస్వామ్యం చేయాలి

## జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.



ప్రజాప్రాలన ప్రణాళిక కార్యక్రమంలో అధికారులతో కలెక్టర్ అభిలాష్ అభినవ్

నిర్మల్ జిల్లా మార్చ్ 6 అమృత్ తెలంగాణ ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో నిర్దేశించిన అన్ని పనులను సంబంధిత అధికారులు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశించారు. శుక్రవారం రాత్రి కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమం అమలుపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, 99 రోజుల ప్రత్యేక కార్యక్రమాల్లో భాగంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టాలని వివరించారు. పెండింగ్ ఫైల్స్ మొత్తం పరిష్కరించాలని తెలిపారు. రానున్న వేసవిలో త్రాగునీటి ఇబ్బందులు కలుగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని చెప్పారు. గ్రామ సభలు నిర్వహించాలన్నారు. వైద్యారోగ్య శాఖకు నిర్దేశించిన అన్ని లక్ష్యాలు పూర్తి చేయాలని వివరించారు. అధికారులు ప్రభుత్వ వసతి గృహాల్లో భోజనం చేసి, నాణ్యత తనిఖీ చేయాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో తనిఖీలు చేయాలన్నారు. తప్పనిసరిగా గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో చేపట్టే కార్యక్రమాలకు సంబంధించి సమాచారం ప్రజాప్రతినిధులకు ముందుగా అందించి, వారిని భాగస్వామ్యం చేయాలన్నారు. అధికారులంతా క్షేత్రస్థాయిలో ఈ కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. అన్ని అంశాలను పర్యవేక్షిస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో కలెక్టరేట్ నుంచి అదనపు కలెక్టర్ లు వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, డిఆర్డిఓ విజయలక్ష్మి, సిపిఓ జీవరత్నం, డిఎంహెచ్ఓ రాజేందర్, డిపివో శ్రీనివాస్, జెడ్పీ సీఈవో శంకర్, డీఈఓ భోజన్న, హౌసింగ్ పిడి రాజేశ్వర్, లు పాల్గొనగా.. మండల కేంద్రాల నుంచి తహసిల్దార్ లు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, ఎంఈఓలు,తదితర అధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు.

# విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి: రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు

## ఆదిలాబాద్‌లో 4.90 కోట్లతో నిర్మించిన సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల భవనం ప్రారంభం



సమావేశంలో మాట్లాడుతున్న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి విద్యార్థులు క్రమశిక్షణతో కష్టపడి చదివి జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ, జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 4.90 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన బాలికల గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాల భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి అత్యంత ప్రాధాన్యతనిస్తోందని, నిరుపేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా గురుకులాలను బలోపేతం చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం కల్పించిన వసతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థానాల్లో స్థిరపడాలని మంత్రి ఆకాంక్షించారు. కోట్లాది రూపాయల వ్యయంతో నిర్మించిన భవన సముదాయాన్ని, పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. విద్యతో పాటు క్రీడలకు కూడా ప్రభుత్వం సమాన ప్రాధాన్యత ఇస్తుందని, అందుకోసం ప్రత్యేకంగా 25 లక్షల నిధులను మంజూరు చేస్తున్నట్లు ఈ సందర్భంగా మంత్రి హామీ ఇచ్చారు. జిల్లా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ.. భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. విద్యా వికాసానికి సహకరిస్తున్న ప్రభుత్వానికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాల చారి, ఎంపీ గోడెం నగేశ్, ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, వెడ్మ బొజ్జు పటేల్, మున్సిపల్ చైర్ పర్సన్ అనూష, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, జిల్లా అటవీ శాఖ అధికారి ప్రశాంత్ బాజీ రావ్ పాటిల్, ఆర్డీఓ స్రవంతి, ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# గజదొంగ "చౌహాన్ రవి" పై పీడీ యాక్ట్ నమోదు.

**ఉత్తర తెలంగాణ అంతట జిల్లాల్లో 26 దొంగతనాల కేసులు**

**ఇచ్చోడ కేసు నందు ఆదిలాబాద్ జైల్లో ఉన్న నిందితుడు.**

**దొంగతనాలలో ఆరితేరి, గ్యాంగుల ద్వారా దొంగతనాలు చేపించిన చౌహాన్ రవి.**

**ఉత్తర్వులను జారీ చేసిన జిల్లా కలెక్టర్**

**చర్లపల్లి జైలుకు తరలించిన మావల పోలీస్ సిబ్బంది.**

**నిందితులపై జిల్లా పోలీస్ యంత్రాంగం కఠిన చర్యలు తప్పవు.**

**అలవాటుగా ఇళ్ళ దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుడిపై పీడీ యాక్ట్ అమలు**



అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ ఆదిలాబాద్ జిల్లా మావల ప్రాంతానికి చెందిన అలవాటుగా గృహ చోరీలకు పాల్పడుతున్న చౌహాన్ రవి (34) పై తెలంగాణ ప్రివెంటివ్ డిటెన్షన్ (పీడీ) చట్టం కింద జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఉత్తర్వులు జారీ చేసినట్లు మావల సీఐ కర్రె స్వామి తెలిపారు. మావల పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో ఆ ఉత్తర్వులు అమలు చేశారు.

నిందితుడు చౌహాన్ రవి s/o బబన్ నివాసం కెఆర్కే కాలనీ, మావల. ఇతను అలవాటుగా దొంగతనాలకు పాల్పడే వ్యక్తిగా గుర్తింపు పొందినట్లు తెలిపారు. ఆదిలాబాద్, నిజామాబాద్, జగిత్యాల, మహబూబాబాద్, నిర్మల్ జిల్లాలతో పాటు వరంగల్, రామగుండం, రాచకొండ కమిషనరేట్ పరిధిలో కూడా అనేక కేసుల్లో పాల్గొన్నట్లు విచారణలో వెల్లడైంది.

2023 నుండి 2025 మధ్య కాలంలో వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఇళ్ల చోరీలు, దుకాణాల దొంగతనాలు కలిపి మొత్తం 18 కేసుల్లో నిందితుడు పాల్గొన్నట్లు పోలీసులు తెలిపారు. బెయిల్‌పై విడుదలైన తరువాత 2025 మే నుండి జూలై మధ్య కేవలం 9 వారాల్లోనే ఆదిలాబాద్ జిల్లాలో మరో 8 ఇళ్ల దొంగతనాలకు పాల్పడినట్లు వెల్లడైంది.

మావల, జైనాథ్, ఇచ్చోడ, ఆదిలాబాద్ టూ టౌన్ పోలీస్ స్టేషన్ల పరిధిలో తాళాలు పగులగొట్టి ఇళ్లలో చోరీలు చేయడం, దుకాణాల షట్టర్లు ఎత్తి నగదు అపహరించడం వంటి ఘటనల్లో బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు, నగదు కలిపి లక్షల రూపాయల ఆస్తి అపహరించినట్లు తెలిపారు.

ఇళ్లలో ఎవరూ లేని సమయాలను గమనించి, పూజలు, వేడుకలు లేదా ఇతర కార్యక్రమాలకు వెళ్లిన కుటుంబాలను లక్ష్యంగా చేసుకొని ఇనుప రాడ్లతో తాళాలు పగులగొట్టి చోరీలు చేసినట్లు విచారణలో బయటపడింది. నిందితుడు ఆర్య హన్మంత్ దేవకర్, మార్కులే అనిల్ తదితరులతో కలిసి గ్యాంగ్‌గా పనిచేసినట్లు తెలిపారు.

ఇంతకుముందు అనేకసార్లు అరెస్టై జైలుకు వెళ్లినా, బెయిల్‌పై విడుదలైన వెంటనే మళ్లీ చోరీలకు పాల్పడుతున్న నేపథ్యంలో ప్రజల భద్రతకు భంగం కలిగిస్తున్నాడని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ భావించి పీడీ యాక్ట్ కు సిఫార్సు చేసి, నిర్బంధం విధించినట్లు తెలిపారు.

నిందితుడు చౌహాన్ రవి ని ఆదిలాబాద్ జిల్లా జైలు నుండి హైదరాబాద్ చెర్లపల్లి కేంద్ర కారాగారానికి తరలించినట్లు తెలిపారు.

# మహిళా సంఘాల బలోపేతమే ప్రభుత్వ లక్ష్యం



మిడ్జిల్ :అమృత్ తెలంగాణ: మహిళా సంఘాల బలోపేతమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందని, జడ్చర్ల మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ జ్యోతి అల్వాల్ రెడ్డి చెప్పారు. శుక్రవారం మండలంలోని పెద్దగుండ్ల తండలో మహిళా సంఘం భవన నిర్మాణానికి సర్పంచ్ రాజు నాయక్ తో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తాండాలలో మహిళా సంఘాల బలోపేతానికి ప్రభుత్వం కృషి కృషి చేస్తుందని అన్నారు. మహిళా సంఘాలు ఆర్థిక, సామాజిక అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. మహిళలు సంఘాల ద్వారా స్వయం ఉపాధి అవకాశాలు పెంపొందించుకొని కుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చేసుకుంటున్నారని అన్నారు. మహిళా సంఘాల సమావేశాలు, శిక్షణా కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రత్యేక భవనం అవసరం ఉండటంతో ఈ భవన నిర్మాణం ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. గ్రామాల్లో మహిళలు ఐక్యంగా పనిచేస్తే గ్రామాభివృద్ధి వేగంగా జరుగుతుందని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మహిళల భాగస్వామ్యం పెరిగితే సమాజ అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో , ఉప సర్పంచ్ శ్రీను నాయక్, గ్రామపంచాయతీ కార్యదర్శి శైలజ, మాజీ ఉప సర్పంచ్ తిరుపతి నాయక్, మాజీ వార్డు సభ్యుడు శంకర్, దీప్లా, బాబు, దేవ్య, ఆంగోత్ దేవుల నాయక్ , శ్రీను, కుమార్, శంకర్, తదితరులు పాల్గొన్నారు. గ్రామ పెద్దలు, మహిళా సంఘ సభ్యులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# ప్రజల గళం -- ప్రజాస్వామ్యానికి ప్రాణం

అమృత్ తెలంగాణ ప్రజాస్వామ్యం అనే భావన మానవ చరిత్రలో అత్యంత ప్రాముఖ్యత కలిగిన రాజకీయ, సామాజిక సిద్ధాంతాలలో ఒకటి. ప్రజలే అధికారానికి మూలం, ప్రజల సంక్షేమమే పాలనకు లక్ష్యం అనే ఆలోచనలపై ఆధారపడి ఏర్పడిన వ్యవస్థే ప్రజాస్వామ్యం. ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడికి సమాన హక్కులు, సమాన అవకాశాలు, న్యాయం లభించాలి. మాట స్వేచ్ఛ, సంఘటితమయ్యే హక్కు, నిరసన తెలిపే హక్కు వంటి ప్రజాస్వామ్య విలువలు సమాజాన్ని చైతన్యంతో ముందుకు నడిపించే శక్తిగా ఉంటాయి.

భారతదేశం స్వాతంత్ర్యం సాధించిన తర్వాత ప్రజాస్వామ్య వ్యవస్థను స్వీకరించింది. రాజ్యాంగం ప్రతి పౌరుడికి ప్రాథమిక హక్కులను కల్పించింది. సామాజిక న్యాయం, ఆర్థిక సమానత్వం, రాజకీయ స్వేచ్ఛ వంటి లక్ష్యాలతో దేశ నిర్మాణం ప్రారంభమైంది. అయితే కాలక్రమేణా సమాజంలో కొత్త సవాళ్లు, సమస్యలు కూడా ఎదురు అయ్యాయి. ముఖ్యంగా ఆర్థిక అసమానతలు, నిరుద్యోగం, వ్యవసాయ సంక్షోభం, కార్మిక హక్కులపై పరిమితులు వంటి అంశాలు ప్రజల జీవన ప్రమాణాలను ప్రభావితం చేస్తున్నాయి.

దేశ నిర్మాణంలో శ్రామిక వర్గాల పాత్ర అపారమైనది. రైతు పొలంలో పండించే పంట దేశ ఆహార భద్రతకు పునాది. కార్మికుడు పరిశ్రమల్లో చేసే శ్రమ దేశ ఆర్థిక వ్యవస్థను నిలబెడుతుంది. ఉపాధ్యాయులు జ్ఞానాన్ని పంచి సమాజానికి దిశానిర్దేశం చేస్తారు. వైద్యులు ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతారు. ఈ విధంగా ప్రతి వర్గం సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తుంది. అయినప్పటికీ, ఈ వర్గాల సమస్యలు అనేక సందర్భాల్లో సరైన ప్రాధాన్యత పొందడం లేదు.

గత కొన్ని దశాబ్దాలుగా ప్రపంచవ్యాప్తంగా అమలవుతున్న ఆర్థిక విధానాలు కూడా సమాజంలో అసమానతలను పెంచినట్లు అనేక పరిశోధనలు సూచిస్తున్నాయి. ప్రైవేటీకరణ, మార్కెట్ ఆధారిత విధానాలు, లాభాల కోసం నడిచే ఆర్థిక వ్యవస్థలు సమాజంలోని బలహీన వర్గాలపై ఒత్తిడిని పెంచుతున్నాయి. ఫలితంగా పేదలు మరింత పేదలుగా, ధనికులు మరింత ధనికులుగా మారుతున్న పరిస్థితి ఏర్పడుతోంది.

ఈ నేపథ్యంలో ప్రజల గళం అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంటుంది. ప్రజాస్వామ్యంలో ప్రజలు తమ సమస్యలను ప్రశ్నించడానికి, నిరసన వ్యక్తం చేయడానికి, న్యాయం కోసం పోరాడడానికి హక్కు కలిగి ఉంటారు. ప్రజల గళాన్ని అణచివేయడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం. ప్రజల అభిప్రాయాలను గౌరవించడం, ప్రజల సమస్యలను పరిష్కరించడం పాలక వ్యవస్థల బాధ్యత.

చరిత్రను పరిశీలిస్తే ప్రజల ఐక్యత ఎంతటి గొప్ప మార్పులను సాధించగలదో స్పష్టంగా తెలుస్తుంది. భారత స్వాతంత్ర్య ఉద్యమం ప్రజల సమిష్టి పోరాటానికి ఒక గొప్ప ఉదాహరణ. కార్మిక ఉద్యమాలు కార్మికుల హక్కులను సాధించాయి. రైతు ఉద్యమాలు వ్యవసాయ సమస్యలను దేశ దృష్టికి తీసుకువచ్చాయి. సామాజిక సంస్కరణ ఉద్యమాలు సమాజంలో సమానత్వాన్ని పెంపొందించాయి.

ఇప్పటి కాలంలో కూడా ప్రజల చైతన్యం అత్యంత అవసరం. ప్రజలు తమ హక్కుల గురించి అవగాహన కలిగి ఉండాలి. సమాజంలో జరుగుతున్న పరిణామాలను విశ్లేషించాలి. ప్రజాస్వామ్యాన్ని బలపర్చే ప్రధాన శక్తి ప్రజల చైతన్యమే. ప్రజలు చైతన్యంతో వ్యవహరించినప్పుడు మాత్రమే పాలక వ్యవస్థలు ప్రజల పట్ల బాధ్యతతో వ్యవహరిస్తాయి.

సమాజంలో సమానత్వం, సామాజిక న్యాయం సాధించడానికి ప్రభుత్వాలు ప్రజా సంక్షేమాన్ని కేంద్రీకరించిన విధానాలను అమలు చేయాలి. వ్యవసాయ రంగానికి రక్షణ, కార్మిక హక్కుల పరిరక్షణ, విద్యా అవకాశాల విస్తరణ, ఆరోగ్య సేవల అందుబాటు వంటి అంశాలు ప్రజల అభివృద్ధికి కీలకమైనవి. అభివృద్ధి ఫలాలు సమాజంలోని ప్రతి వర్గానికి చేరినప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుంది.

ప్రపంచ స్థాయిలో కూడా ప్రస్తుతం అనేక సవాళ్లు ఎదురవుతున్నాయి. యుద్ధాలు, ఆర్థిక అసమానతలు, వాతావరణ మార్పులు వంటి సమస్యలు మానవ సమాజాన్ని ప్రభావితం చేస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో ప్రపంచ దేశాలు శాంతి, సహకారం, సమాన అభివృద్ధి అనే లక్ష్యాలతో ముందుకు సాగాలి. ప్రపంచ శాంతి లేకుండా మానవ అభివృద్ధి సాధ్యం కాదు.

ప్రజాస్వామ్యం ఒక నిరంతర ప్రక్రియ. అది ప్రజల చైతన్యం, ఐక్యత, పోరాటస్ఫూర్తితో బలపడుతుంది. ప్రజల గళం ఎప్పటికీ మూయబడదు. నిజం కోసం, న్యాయం కోసం, సమానత్వం కోసం ప్రజలు ఎప్పటికీ పోరాడుతూనే ఉంటారు.

అందుకే ప్రతి పౌరుడు ఒక సత్యాన్ని గుర్తుంచుకోవాలి---

ప్రజాస్వామ్యం కేవలం ఒక రాజకీయ వ్యవస్థ కాదు; అది ప్రజల ఆశయాల ప్రతిబింబం. ప్రజల గళమే ప్రజాస్వామ్యానికి ప్రాణం. ప్రజల ఐక్యతే సమాజంలో మార్పుకు మార్గం. ఈ భావనతోనే ప్రజలు ముందుకు సాగినప్పుడు మాత్రమే న్యాయం, సమానత్వం, శాంతి వంటి విలువలు సమాజంలో స్థిరపడతాయి. ప్రజల శక్తిని ఎవరూ నిర్లక్ష్యం చేయలేరు. ప్రజల గళం వినిపించినప్పుడు సమాజం మార్పు దిశగా అడుగులు వేస్తుంది.




కేఎల్ రాములు అమృత్ తెలంగాణ తెలుగు దినపత్రిక నిర్మల్ నిజాంబాద్ జిల్లాల బ్యూరో ఇంచార్జ్

# జోడెఘాట్ కొండల్లో గిరిజన యోధుడి గర్జన!

## సి.వి. రమణ రెడ్డి 9440381697

భారతదేశ స్వాతంత్ర్య పోరాట చరిత్రలో గిరిజన విప్లవ వీరుల పాత్ర ఎంతో అమోఘం అదిలాబాద్ అడవుల్లో నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన ధీశాలి కుమురం భీమ్ అడవిపై హక్కుల కోసం ఆయన చేసిన పోరాటం నేటికీ స్ఫూర్తిదాయకం అన్యాయాన్ని ఎదిరించి గిరిజనుల ఆత్మగౌరవాన్ని కాపాడటానికి ప్రాణాలను పణంగా పెట్టిన గొప్ప యోధుడు భీమ్ జల్ జంగల్ జమీన్ అనే నినాదంతో అడవి బిడ్డలను ఏకం చేసి విప్లవ శంఖం పూరించారు ఈ నేల మీద పుట్టిన ప్రతి బిడ్డ భీమ్ త్యాగాన్ని స్మరించుకుంటారు అడవి తల్లి ఒడిలో పెరిగిన ఆయన గిరిజనుల కష్టాలను స్వయంగా చూసి చలించిపోయారు నిజాం సైన్యాన్ని గడగడలాడించిన గిరిజన పులిగా భీమ్ చరిత్రలో నిలిచిపోయారు

జోడెఘాట్ కొండల్లో విప్లవ జ్వాలలు

అదిలాబాద్ జిల్లాలోని జోడెఘాట్ కొండలు కుమురం భీమ్ వీరోచిత పోరాటానికి సాక్ష్యంగా నిలుస్తాయి నిజాం ప్రభుత్వం విధించిన అక్రమ పన్నులకు వ్యతిరేకంగా ఇక్కడి నుండే ఆయన సమరం ప్రారంభించారు పన్నెండు గిరిజన గ్రామాలను ఏకం చేసి ఒక బలమైన సైన్యాన్ని నిర్మించుకున్నారు గెరిల్లా యుద్ధ తంత్రాలతో శత్రువులకు సింహస్వప్నంగా మారారు జోడెఘాట్ గుట్టల్లో భీమ్ గర్జన విన్న నిజాం సైన్యం భయంతో వణికిపోయేది స్వయం పాలన కోసం ఆయన చేసిన పోరాటం గిరిజన హక్కుల ఉద్యమానికి పునాది వేసింది ఈ ప్రాంతం భీమ్ సాహసకృత్యాలకు వేదికగా మారి అమరత్వానికి చిహ్నంగా నిలిచింది ప్రతి రాయి రప్ప భీమ్ వీరగాథను నేటికీ వినిపిస్తూనే ఉంటాయి

జల్ జంగల్ జమీన్ నినాద ప్రాశస్త్యం

కుమురం భీమ్ ఇచ్చిన జల్ జంగల్ జమీన్ నినాదం కేవలం మాటలు కావు అవి గిరిజన జీవన వేదాలు నీరు అడవి భూమిపై గిరిజనులకే సర్వహక్కులు ఉండాలని ఆయన బలంగా ఆకాంక్షించారు. హక్కుల కోసం ఆయన చేసిన రాజీలేని పోరాటం ప్రపంచవ్యాప్త గుర్తింపు పొందింది ప్రకృతి సంపదను కాపాడుకోవడమే కాకుండా దానిని అనుభవించే అధికారం స్థానికులకే ఉండాలని నినదించారు నిజాం సైనికులు గిరిజనులను వేధించినప్పుడు భీమ్ తన గొడ్డలి పట్టి ఎదురుతిరిగారు అణచివేతకు గురవుతున్న ప్రజల్లో చైతన్యం నింపి పోరాట పటిమను పెంచారు ఈ నినాదం నేటికీ గిరిజన హక్కుల పోరాటాలకు ప్రధాన అస్త్రంగా ఉపయోగపడుతోంది భూమి కోసం ప్రాణాలిచ్చే తత్వం భీమ్ నుండి మనకు లభించింది

కుమురం భీమ్ అమరత్వం స్మృతి వనం

జోడెఘాట్ వద్ద జరిగిన భీకర పోరాటంలో భీమ్ వీరమరణం పొందారు కానీ ఆయన ఆశయాలు అమరంగా మిగిలిపోయాయి ప్రభుత్వం ఇక్కడ కుమురం భీమ్ స్మారక మ్యూజియం ఏర్పాటు చేసి ఆయన చరిత్రను భద్రపరిచింది ఈ మ్యూజియం గిరిజన సంస్కృతి విశేషాలతో పాటు భీమ్ పోరాట పటాలను ప్రదర్శిస్తుంది పర్యాటకులు విద్యార్థులు ఇక్కడికి వచ్చి అడవి బిడ్డల వీరత్వాన్ని తెలుసుకుంటున్నారు జోడెఘాట్ ఇప్పుడు ఒక పర్యాటక కేంద్రంగానే కాకుండా ఒక పవిత్ర క్షేత్రంగా విరాజిల్లుతోంది భీమ్ విగ్రహం వద్ద నివాళులు అర్పించడం ప్రతి గిరిజనుడికి ఒక గర్వకారణం ఆయన త్యాగాన్ని స్మరించుకుంటూ ప్రతి ఏటా ఇక్కడ పెద్ద ఎత్తున ఉత్సవాలు నిర్వహిస్తారు భవిష్యత్తు తరాలకు ఈ స్మృతి వనం ఒక గొప్ప విద్యా కేంద్రంగా నిలుస్తోంది

ప్రగతి పథంలో గిరిజన వాడలు భీమ్ ఆశయ సాధన

కుమురం భీమ్ కలలు గన్న స్వయం పాలన నేడు తెలంగాణ రాష్ట్రంలో సాకారమవుతోంది గిరిజన తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చడం ద్వారా వారి పరిపాలన వారి చేతుల్లోకి వచ్చింది అటవీ భూములపై హక్కులు కల్పిస్తూ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు భీమ్ త్యాగానికి నిజమైన నివాళి అదిలాబాద్ జిల్లా గిరిజన ప్రాంతాల్లో విద్య వైద్యం మౌలిక సదుపాయాలు మెరుగుపడుతున్నాయి భీమ్ పేరుతో ప్రత్యేక జిల్లా ఏర్పాటు చేయడం ఆయనకు దక్కిన అతిపెద్ద గౌరవం గిరిజన బిడ్డలు నేడు అన్ని రంగాల్లో రాణిస్తూ అభివృద్ధి పథంలో దూసుకుపోతున్నారు ఆయన చూపిన ధైర్యం పోరాట పటిమ నేటి యువతకు మార్గదర్శకంగా నిలుస్తోంది అడవి తల్లి దీవెనలతో గిరిజన జెండా గగనతలంపై ఎప్పుడూ రెపరెపలాడుతూనే ఉంటుంది



# మహిళలకు సానిటరీ ప్యాడ్ కిట్స్ పంపిణీ

చిన్నకోడూరు.అమృత్ తెలంగాణ: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మహిళ లకు సానిటరీ కిట్స్ ను అందజేసినట్లు జిల్లా కాంగ్రెస్ మహిళ అధ్యక్షురాలు ముద్దం లక్ష్మి చేతుల మీదుగా అందజేశారు. చిన్నకోడూరు, నారాయణరావుపేట, నంగునూరు మండలలా బ్లాక్ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు ఎదుగాని లహరి ఆధ్వర్యంలో గురువారం మండల పరిధిలోని ఎల్లమ్మ జాలు గ్రామం లో సూమారు 100 మంది మహిళలకు అందజేశారు.

ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్షంగా పెట్టుకొవడమే కాకుండా వారి ఆరోగ్య పరిస్థితి మెరుగుగా ఉండాలనే ఉద్దేశ్యంతో ప్రతి మహిళ నెలసరికి వాడే శానిటరి కిడ్స్ విషయంలో కూడా కెమికల్స్ ప్యాడ్స్ వాడి అనారోగ్యం బారిన పడకుండా కెమికల్ లేని సానిటరీ కిట్స్ ను ఇలా ప్రభుత్వమే మహిళలకు అందజేయడం శుభపరిణామం అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మహిళల అందరికి ఈ సానిటరీ ప్యాడ్స్ అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మహిళ నాయకురాలు రజిని, మమత,ఎల్లమ్మ జాలు వార్డ్ మెంబెర్ లాస్య తదితరులు పాల్గొన్నారు.

# కంచనపల్లిలో ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం

మిడ్జిల్ :అమృత్ తెలంగాణ: మండలంలోని కంచనపల్లి గ్రామంలో శుక్రవారం ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ క్రమంలో విద్యార్థులు ఉపాధ్యాయులే తోటి విద్యార్థులకు విద్యను బోధించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మహేశ్వరి మల్లేష్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని అన్నారు. ఎంతోమంది విద్యార్థులను ఉన్నత శిఖరాలకు చేర్చినది ఉపాధ్యాయులేనని తెలిపారు. ఒక్కరోజు ఉపాధ్యాయులుగా విధులు నిర్వహించిన విద్యార్థులు భవిష్యత్తులో కూడా ఉపాధ్యాయులు అయ్యేవిధంగా కష్టపడి చదువుకోవాలని విద్యార్థులకు సూచించారు. చదువు ద్వారానే సమాజంలో మార్పు వస్తుందని, పేదరికం తొలగిపోవాలంటే చదువు ఒకటే మార్గంమని ఉద్భోదించారు.

# ఆ హీరో అంటే అమ్మడికి అంత క్రష్.. ఓపెన్ గా చెప్పేసింది



ఒకే ఒక్క పాట.. అందులోని ఒకే ఒక్క ఎక్స్ ప్రెషన్ తో ఇంటర్నెట్ ను షేక్ చేయటమే కాదు.. అశేష భారతానికి సుపరిచితం కావటమే కాదు.. దాదాపు ప్రతిఒక్క వాట్సాప్ గ్రూపుల్లో షేర్ అయిన సంచలన హీరోయిన్ ప్రియా ప్రకాష్ వారియర్. గతంలో మీ అభిమాన నటుడు ఎవరు? అన్న ప్రశ్నను వేస్తే.. సమాధానం చెప్పేందుకు చాలా ఇబ్బంది పడేవారు. ఆచితూచి అన్నట్లు సమాధానం చెప్పేవారు. ఇప్పుడు సీన్ మారింది. మీకు ఇష్టమైన హీరో ఎవరంటే.. తడుముకోకుండా సమాధానం చెప్పేయటమే కాదు.. కొందరు హీరోయిన్లు అయితే ఏకంగా తాము ఇష్టపడే హీరోల పేరు.. క్రష్ ఉన్న హీరో పేరును కూడా చెప్పేస్తున్నారు. తాజాగా అలాంటి పనే చేశారు సంచలన హీరోయిన్ ప్రియా ప్రకాష్ వారియర్. ఒరు ఆధార్ లవ్ అనే మూవీతో పాపులర్ అయిన ఆమె.. మలయాళం.. తెలుగుతో పాటు హిందీ మూవీలు కూడా చేశారు. తాజాగా ఆమె చూపు కోలీవుడ్ మీదకు మళ్లినట్లుగా చెబుతున్నారు. ఇటీవల కాలంలో హీరో ధనుష్ కు సంబంధించిన విషయాల్ని తన ఇన్ స్టా లో షేర్ చేస్తూ.. అందరి అటెన్షన్ ను డ్రా చేస్తోంది. తాజాగా ఒక విలేకరి అడిని ప్రశ్నకు ఆమె సమాధానం ఇవ్వటమే కాదు.. తన ఇన్ స్టాలో ధనుష్ కు సంబంధించిన పోస్టులు ఎందుకు పెడుతున్న విషయానికి జస్టిఫికేషన్ ఇచ్చేలా బదులు ఇవ్వటం గమనార్హం.

# ఆ భయంతోనే ఇంట్లో వెంటనే చెప్పలేదు

టాలీవుడ్ ఇండస్ట్రీలో హీరోయిన్ల కొరత చాలా ఎక్కువగా ఉంది. అందులోనూ తెలుగమ్మాయిల కొరత అయితే ఇంకా ఎక్కువగా ఉంది టాలీవుడ్ ఇండస్ట్రీలో హీరోయిన్ల కొరత చాలా ఎక్కువగా ఉంది. అందులోనూ తెలుగమ్మాయిల కొరత అయితే ఇంకా ఎక్కువగా ఉంది.కెరీర్ ఆరంభంలో షార్ట్ ఫిల్మ్ లో నటించిన ప్రియాంక జవాల్కర్ తర్వాత సినీ ఇండస్ట్రీలోకి వచ్చి మెల్లిగా హీరోయిన్ గా మారింది. విజయ్ దేవరకొండ హీరోగా నటించిన ట్యాక్సీ వాలా సినిమాతో ప్రియాంక హీరోయిన్ గా మారిన విషయం తెలిసిందే.ఆ తర్వాత కిరణ్ అబ్బవరంహీరోగా వచ్చిన కల్యాణ మండపంతో మరో హిట్ ను అందుకున్న ప్రియాంక రీసెంట్ గానే మ్యాడ్ స్క్వేర్ సినిమాలో ఓ కీలక పాత్ర చేసింది. మ్యాడ్ స్క్వేర్ సక్సెస్ అయినందుకు తన ఆనందాన్ని షేర్ చేసుకుంటూ మీడియాతో మాట్లాడిన ప్రియాంక తను చేసిన మొదటి సినిమా గురించి పలు ఇంట్రెస్టింగ్ విషయాలను వెల్లడించింది. చదువు అయిపోయిన తర్వాత నుంచే ప్రియాంక షార్ట్ ఫిల్మ్స్ చేస్తూ ఏదైనా సినిమా ఛాన్స్ వస్తుందేమోనని ట్రై చేస్తూనే ఉంది. ఇంట్లో వాళ్లకు ఆ విషయం తెలిసి కూడా తనకు నచ్చింది చేసుకుంటుందిలే అని ఏమనకుండా వదిలేశారు.



# బాప్ రే.. బీచ్ ని మరిగించిన నోరా వైరస్

డ్యాన్సింగ్ క్వీన్ నోరా ఫతేహి గురించి పరిచయం అవసరం లేదు. సోషల్ మీడియాలో ఇతర నాయికలతో పోలిస్తే చాలా స్పీడ్ గా ఉంటుంది. తరచుగా తన అందమైన ఫోటోలు వీడియోలతో నెటిజనులకు కావాల్సిన ట్రీటిస్తూనే ఉంది. ఇటీవల నోరా తన ఇన్ స్టాగ్రామ్ హ్యాండిల్ లో తన డ్యాన్స్ వీడియోను షేర్ చేసింది. ఈ వీడియోలో నోరా ఒక బీచ్ లో తన గై గ్యాంగ్ తో కలిసి హీటెక్కించే బీట్ కి డ్యాన్స్ చేస్తూ కనిపించింది. మనోహరి ఎప్పటిలాగే అందంగా కనిపించింది. నోరా ఫతేహి చిస్ బ్రౌన్ లేటెస్ట్ సాంగ్ 'కాల్ మి ఎవ్రీ డే ఇన్ మారిషస్..' కి డ్యాన్స్ చేస్తున్న వీడియోను పోస్ట్ చేసింది. ఆమె స్నేహితులు రజిత్ దేవ్ – మేకప్ ఆర్టిస్ట్ మార్స్ పెడ్రోజో కూడా చేరారు. నోరా బీచ్ లోని ట్రాక్ కోసం తన సాధారణ శైలిలో డ్యాన్స్ చేస్తూ కనిపిస్తుంది. ఆకట్టుకునే ఈ డ్యాన్స్ వీడియోకి 'వైబింగ్ ప్రతిరోజూ కాల్ చేయండి'అని క్యాప్షన్ ని ఇచ్చింది.. వీడియోలో నోరా పింక్ బీచ్ బ్రా– డెనిమ్ మినీ షార్ట్లను ధరించి కనిపించింది. తన పోస్ట్ ను సోషల్ మీడియాలో షేర్ చేయగానే చాలా మంది గుండె –ఫైర్ ఎమోజీలను షేర్ చేసారు. అందాల నోరా డ్యాన్స్ స్కిల్స్ గురించి పరిచయం అవసరం లేదు. ఆమె ఎక్కడైనా డ్రమ్స్ రోల్ విన్నా.. పాప్ బీట్ విన్నా వెంటనే నాగిని నృత్యంతో వెస్ట్రన్ స్టైల్ డ్యాన్స్ లతో కట్టి పడేస్తుంది. బీచ్ లో నోరా ఫతేహి డ్యాన్సులకు వీక్షకులు కూడా జాయినయ్యేంత స్ఫూర్తిని నింపిందని చెప్పాలి. ఇంతకీ ఇది ఏ బీచ్ అంటే? థాయ్లాండ్ లోని ఉష్ణమండల బీచ్ ఇది నోరా ఎల్లపుడూ బీచ్ గాలిలో డ్యాన్స్ చేయడాన్ని చాలా సీరియస్గా తీసుకుంటుందని మనకు తెలుసు. గత సంవత్సరం నోరా ఫతేహి 'వన్ డ్యాన్స్' ఛాలెంజ్ని స్వీకరించినప్పుడు



ఇంటర్నెట్ లో యువతరం తమవైన డ్యాన్స్ కదలికలతో విపరీతంగా స్పందించారు. కానీ ఇప్పుడు అందరూ పింక్ బ్యాండో బికినీ– షార్ట్ లలో నోరాతో పోటీపడాలనుకోవడం ఖాయం. డెనిమ్ షార్ట్– పింక్ బ్యాండ్యూ బికినీ సెట్ లో నోరా చాలా స్పెషల్ గా ఉందని అభిమానులు వ్యాఖ్యానిస్తున్నారు. ఈ బ్యూటీ ప్రస్తుతం డ్యాన్స్ రియాలిటీ షోల జడ్జిగా .. ఐటమ్ భామగా భారీగానే ఆర్జిస్తోంది. విదేశీ ఈవెంట్లు... ఫ్యాషన్ ఈవెంట్లు ...ఇతర ప్రకటనల ద్వారాను ఆదాయాన్ని గణనీయంగా పెంచుకుంది.




# ఓపెన్ బాత్ రూంలోని బాత్ టబ్ లో ముద్దుగుమ్మ అందాల విన్యాసాలు



విశ్వక్సేన్ హీరోగా నటించిన అశోక వనంలో అర్జున కళ్యాణం సినిమాలో హీరోయిన్ గా నటించిన రుక్సార్ ధిల్లాన్ మంచి గుర్తింపును దక్కించుకున్న విషయం తెలిసిందే. ఈ అమ్మడు మొదటి సినిమాతోనే నటిగా పాపులారిటీని సొంతం చేసుకున్నప్పటికీ ఆశించిన స్థాయిలో ఆఫర్స్ దక్కించుకోలేక పోతుంది. దాంతో సోషల్ మీడియాలో సాధ్యమైనంత వరకు ఎక్కువ శాతం మంది దృష్టిని ఆకర్షించాలి అనుకుందో ఏమో కానీ ఇలా అందాల ఆరబోతకు సిద్ధమయింది. గత కొన్నాళ్లుగా ఈ అమ్మడు ఇంస్టాగ్రామ్ లో రెగ్యులర్ గా ఇలాంటి హాట్ ఫోటో షూట్స్ ని ఇస్తుంది. తాజాగా ఓపెన్ బాత్రూంలో బాత్ టబ్ లో పడుకొని బికినీతో ఫోటోలకు ఫోజ్ ఇచ్చింది. బాత్ టబ్ లో ఉండి ఫోటోలకు ఫోజు ఇవ్వడం అంటే మామూలు విషయం కాదు.

Printed, Published and Owned by SIGIDI AMRUTH.D.NO: 184C. OLD HOUSING BOARD COLONY -504309,
ADILABAD DISTRICT, TELANGANA. CELL : 9849973404. E-Mail- singidiamruth404@gmail.com